క్లుప్తంగా

సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూడాలి



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

మిర్యాలగూడ : ఈవీఎంల కమిషనింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని, ఈవీఎంలలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిచందన అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల కమిషనింగ్‌ను స్థానిక అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం ఈవీఎంల పనితీరుతో పాటు ఏమైనా సాంకేతిక సమస్యలు వస్తున్నాయా..? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మిర్యాలగూడ ఆర్డీఓ, ఏఆర్ఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ హరిబాబు పాల్గొన్నారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం అపహరణ

దేవరకొండ : రేషన్ దుకాణం తాళాలు పగలగొట్టి 5క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన శనివారం దేవరకొండ మండల పరిధిలో చోటు చేసుకుంది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మైనంపల్లి రేషన్ దుకాణంలో నిల్వ ఉంచిన 5క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి దుకాణం తాళాలు పగలగొట్టి అపహరించారు. ఆదివారం విషయం తెలుసుకున్న రేషన్ డీలర్ జయలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా ఘనిషహీద్



ఘనిషహీద్‌ను సన్మానిస్తున్న ఆటో డ్రైవర్లు

మిర్యాలగూడ : దామరచర్ల ఆటో యూనియన్ అధ్యక్షుడిగా ఘనిషహీద్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఘనషహీద్ మాట్లాడుతూ ఆటో యూనియన్ సభ్యులకు ఎలాంటి సమస్య వచ్చిన తాను అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బైరం భిక్షం, దుర్గయ్య, శ్రీను, జాని, బాబు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడి జయంతి వేడుకలు



బుద్ధుడి జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

దేవరకొండ : గౌతమ బుద్ధుడి 2568వ జయంతి వేడుకలను ఆదివారం దేవరకొండ పట్టణంలో ప్రజా సంఘాల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బుద్ధుడి చిత్రపటం వద్ద పూలమాల ఉంచి మాట్లాడారు. సమ సమాజ స్థాపన కోసం గౌతమ బుద్ధుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని వారు కోరారు. శాంతి మార్గంలో ప్రజలంతా ఒక్కటిగా జీవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చొల్లేటి భాస్కరాచారి, కంబాలపల్లి వెంకటయ్య, ఎర్ర ఆంజనేయులు, సైదులు, నరసింహాతదితరులు పాల్గొన్నారు

సేవ చేసే వారికి ఓటేయండి

- స్వతంత్ర అభ్యర్థి చొల్లేటి ప్రభాకర్



హైదరాబాద్ రోడ్డులో ప్రచారం చేస్తున్న చొల్లేటి ప్రభాకర్

నల్లగొండ టౌన్ : నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే అభ్యర్థులను గుర్తించి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయాలని స్వతంత్ర అభ్యర్థి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. ఆయన ఆదివారం హైదరాబాద్ రోడ్డులో ఎన్నికల ప్రచారం చేసిన సందర్భంగా మాట్లాడారు. ఓటుకు, మద్యానికి అమ్ముడుపోకుండా సరైన అభ్యర్థులను గుర్తించి ఓట్లేయాలని అన్నారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే నిరుద్యో గ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రతి వార్డులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు పరిరక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఉచితంగా గ్రూప్ పరీక్షలకు శిక్షణ ఏర్పాటు చేస్తామని యువతకు చేయూత నందిస్తామన్నారు.

హరితవనంలా 'పంచాయతీ' ఆవరణ

- పెద్దవూర గ్రామ పంచాయతీ ఆవరణలో అడుగుపెడితే ఆహ్లాదమే..
- మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ
- ఎండవేడిమిని దూరం చేస్తున్న చెట్లు



కార్యాలయం ఆవరణలో దారి వెంట ఉన్న చెట్లు



కార్యాలయం లోపల పెరిగిన చెట్లు

పెద్దవూర : ప్రభుత్వ కార్యాలయం అంటే ఎక్కడ చూసినా పిచ్చిమొక్కలు, నిర్వహణ లేకపోవడంతో అపరిశుభ్రంగా ఆవరణ.. కాసేపు కూర్చుందామంటే నిలువ నీడ లేని పరిసరాలు.. సహజంగా అందరికీ ఇలాంటి భావనే ఉంటుంది. కాని ఒక్కసారి పెద్దవూర మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్తే మీ భావన మార్చుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటారా? ఈ పంచాయతీ కార్యాలయం హరితవనాన్ని తలపిస్తోంది. పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలు, చెట్లతో పచ్చదనం కనువిందు చేస్తోంది. ప్రస్తుత వేసవి సీజన్‌లో బయట అంతా ఎండలు తీవ్రంగా ఉంటే ఈ కార్యాలయంలో మాత్రం చెట్లు, మొక్కల కారణంగా ఎండ ప్రభావం లేకపోవడంతో పచ్చని వాతావరణంతో, తీరొక్క మొక్కలతో కళకళలాడుతూ ఆహ్లాదాన్ని పంచుతుంది. ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న సముదాయంలోనే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారు. దీంతో వివిధ పనులపై మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, వైద్య సేవలకు వచ్చే ప్రజలు గ్రామ పంచాయతీ కార్యాలయాలనికి వచ్చి సేదదీరుతుంటారు. గత నాలుగేళ్ల క్రితం కార్యాలయ భవనాన్ని అనుకుని ముందుభాగంలో ఇనుప రేకులు వేసి చుట్టూ ప్రజలు కూర్చునేలా రెండు అడుగుల ఎత్తులో గోడను నిర్మించారు. గతంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ముందు, వెనకాల, పక్కన ఖాళీగా ఉన్న ప్రదేశాలలో ఎర్రమట్టిని పోయించి అందులో తీరొక్క మొక్కలను నాటారు. ఇందులో పూలు, పండ్లు, కూరగాయలు, నీడనిచ్చే చెట్లను నాటించారు. పంచాయతీ కార్యదర్శి పానుగోతు ధాకునాయక్ ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతిరోజూ నీరు పోయించి మొక్కల సంరక్షణ చేపట్టడంతో అవి ఏపుగా పెరిగాయి. దీంతో కార్యాలయం ఆవరణ మొత్తం పచ్చదనం సంతరించుకుంది. చుట్టూ చెట్లు ఉండటంతో కార్యాలయం లోనికి వెళ్లేదాకా గ్రామ పంచాయతీ కార్యాలయం కనిపించదు. మండు వేసవిలో కూడా ఇక్కడికి వెళ్తే వేడి ప్రభావం కనిపించదు. దీంతో మండల కేంద్రంలోని పలువురు మధ్యాహ్న సమయంలో ఇక్కడికి వచ్చి సేదదీరుతున్నారు. వీనికి తోడు కార్యాలయం ముందు భాగంలో ఉన్న వృక్షం చుట్టూ మూడు అడుగుల ఎత్తులో, రెండు అడుగుల వెడల్పుతో సిమెంట్, కాంక్రీటుతో రచ్చబండ లాగా ఏర్పాటు చేశారు. దీంతో చెట్టు నీడలో సైతం ప్రజలు కూర్చుని ముచ్చటించుకుంటున్నారు.

ఆహ్లాదం పంచేలా మొక్కల పెంపకం

కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా వివిధ రకాల ఆకర్షణీయమైన మొక్కలను నాటారు. కార్యాలయంలోని ప్రహరీ చుట్టూ పలు రకాల పూలు, పండ్లు నీడనిచ్చే మొక్కలతో పాటు ఆయుర్వేదానికి పనికివచ్చే మొక్కలను నాటించారు. గేటు లోనికి వెళ్లగానే ఉన్న ఖాళీ ప్రదేశంలో పలు రకాల ఆహ్లాదాన్ని ఇచ్చేలా వరుసలలో మొక్కలు నాటి నిత్యం సంరక్షణ చేపడుతుండటంతో పచ్చదనం ఇట్టే ఉట్టిపడుతుంది. వానాకాలంలో చెట్ల మధ్యన కూరగాయలు, ఆకుకూరలను వేసి ఎలాంటి రసనాయన మందులను ఉపయోగించకుండా సేంద్రీయ పద్ధతిలో పెంచుతున్నారు. ఏపుగా పెరిగిన చెట్లకు తీగ జాతి కూరగాయల మొక్కలను పెట్టి కూరగాయలను పండిస్తున్నారు. గేటు నుంచి కార్యాలయానికి వెళ్లే దారికి రెండువైపులా ఆహ్లాదాన్ని ఇచ్చే చెట్లు పెట్టడంతో అవి ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చుట్టూ చెట్లు, మధ్యలో పంచాయతీ కార్యాలయం ఉండటంతో పచ్చదనంతో కూడిన ఆనందాన్ని పొందుతున్నారు.

ఆదర్శంగా ఉండాలని..



ప్రభుత్వం ప్రతి యేటా హరిత హారం కార్యక్రమాన్ని చేపడుతోంది. దీంతో తన పనిచేసే కార్యాలయం అందరికీ ఆదర్శంగా ఉండాలనే సంకల్పంతో గత సర్పంచ్, సిబ్బంది సహకారంతో మొక్కల పెంపకం చేపట్టా. పంచాయతీ కార్యాలయం ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఉంది. ఆఫీసులకు వచ్చే ప్రజలకు కొంత ఆహ్లాదాన్ని కల్పించాలనే సంకల్పం కూడా మొక్కల పెంపకానికి దోహదం చేసింది. ప్రాణ వాయువుని ఇచ్చేది మొక్కలు. ఆ మొక్కలను నాటే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలి. తద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది.

- పానుగోతు ధాకునాయక్, పంచాయతీ కార్యదర్శి, పెద్దవూర

బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ సాధ్యమని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయన నివాసం వద్ద నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు నల్లగాసు జాన్‌యాదవ్, పార్వతి, నాయకులు జాల నర్సింహారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, హన్మంతు వెంకటేష్‌గౌడ్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పెద్దవూర : మండలంలోని కోమటికుంటతండా తాజా మాజీ సర్పంచ్ బాణావత్ శంకర్‌నాయక్ ఆదివారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి, గడ్డంపల్లి వినయ్‌రెడ్డి, అశోక్, బిచ్చునాయక్, నక్కల రామాంజిరెడ్డి, మునినాయక్ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నిత్యసాధనతోనే లక్ష్యం సాధించవచ్చు

నల్లగొండ టూటౌన్: క్రీడాకారులు నిత్యసాధనతోనే అనుకున్న లక్ష్యానికి చేరుకోవచ్చని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన చత్రపతి శివాజీ ఫుట్‌బాల్ లీగ్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో చత్రపతి శివాజీ స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకులు బొమ్మ పాల గిరిబాబు, కోచ్ మద్దు కర్ణాకర్, వెంకట సాయి,యశ్వంత్, శివదాసు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ క్రీడాకారులతో భిక్షంగౌడ్

రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



మిర్యాలగూడ అర్బన్ : సీపీఐ సమావేశంలో పాల్గొన్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : వామపక్ష పార్టీలు బలపర్చిన నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని యాద్గర్‌పల్లిలో ఏర్పాటు చేసిన సీపీఐ, సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం యువతను, కార్మికులను, కర్షకులను అనే తేడా లేకుండా మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, నాయకులు జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, సీపీఎం నాయకులు రామకృష్ణ, సీపీఐ నాయకులు గువ్వ వెంకటయ్య, చంద్రమౌళి, యాదగిరి, రాములు, రవి, సుదర్శన్, రామస్వామి, సురేస్, రాములు, అశోక్, సైదులు పాల్గొన్నారు.

డిండి : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్ష్మీ తిర్పతి ప్రజలను కోరారు. ఆదివారం మండల పరిధిలోని ప్రతాప్‌నగర్ గ్రామంలో ఇంటింటి ప్రచారంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకా ఆరు గ్యారంటీలను అమలు చేయడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం వచ్చి రోజు రోజుకు వలసలు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, మధుసూదన్‌రెడ్డి, నీరంజన్, లాలూ, రాములు, లక్ష్మయ్య, బాబు, సామ్మ, కిషన్ పాల్గొన్నారు.

నల్లగొండలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం



కొండమల్లేపల్లి : బీజేపీ మేనిఫెస్టోను ఓటర్లకు వివరిస్తున్న నాయకులు



నిడమనూరు : ప్రచారంలో భాగంగా కటింగ్ చేస్తున్న మన్నెం రంజిత్ యాదవ్

కొండమల్లేపల్లి : నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్‌యాదవ్ అన్నారు. ఆదివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన మండల బూత్ అధ్యక్షులు, బూత్ కోఆర్డినేటర్లు, బీఎల్ఏల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల6న నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రజలు మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వెంకటేష్‌యాదవ్, సాంబశివగౌడ్, యాదగిరి, మల్లేష్, నాగేష్, వెంకటయ్య, గోపి ఉన్నారు.

గడప గడపకూ బీజేపీ ప్రచారం

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ నాయకులు ఆదివారం వడ్యతండా, కారోబార్‌తండాలలోని 107, 108 పోలింగ్ బూత్‌ల పరిధిలో గడప గడపకు బీజేపీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు కేతావత్ లాలునాయక్ మాట్లాడుతూ కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం కొలువుదీరడం ఖాయమన్నారు. నల్లగొండ పార్లమెంట్ స్థానంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నక్క వెంకటేశ్‌యాదవ్, వరికుప్పల వెంకటయ్య, బూత్ అధ్యక్షులు నేనావత్ వస్త్రాం, నేనావత్ శివ, ఇస్లావత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి

నిడమనూరు : నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్ యాదవ్ కోరారు. ఆదివారం మండలంలోని వడ్డెరగూడెం, వల్లభాపురం, కక్కయగూడెం, రేగులగడ్డ గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు యాదగిరి, నాగరాజ, లింగస్వామి, మహేందర్, ఆంజనేయులు, మహిళామోర్చా అధ్యక్షురాలు అరుణ, నాగమణి పాల్గొన్నారు.

దేవరకొండ : పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిన్న వెంకట్ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దేవరకొండలో నిర్వహించిన ఆ పార్టీ పట్టణ, రూరల్ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం పదేళ్లలో ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చెనమోని రాములు, గుండాల అంజయ్య, పబ్బు సైదులు, నేతాళ్ల వెంకటేష్, జల్దాభాస్కర్, గీతారాణి పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో విద్యార్థులు, యువతే కీలకం



సత్యనారాయణ పురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

త్రిపురారం : దేశాభివృద్ధిలో విద్యార్థులు, యువతే కీలకమని ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సుమాళిని, డాక్టర్ మీనా, డాక్టర్ ప్రశాంత్ అన్నారు. ఆదివారం మండలంలోని సత్యనారాయణపురంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యార్థులు నిర్వహిసున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా వయ్యారిభామ కలుపు మొక్కల వల్ల గ్రామంలో వ్యవసాయ పంటలలో కలిగే నష్టాలు, నివారణ చర్యలపై రైతుల అవగాహన కల్పించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో వయ్యారిభామ కలుపు మొక్కలను గుర్తించి రైతులతో కలిసి తొలగించారు. అనంతరం త్రిపురారం ఎస్ఐ వీర శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. వ్యవసాయ విద్యతో గ్రామాల్లో రైతుల స్థితిగతులను మెరుగుపర్చడానికి తోడ్పడుతుందన్నారు. మండలంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం కంపాసాగర్ హెడ్ డాక్టర్ లింగయ్య, కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రంజిత పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించేందుకే కాంగ్రెస్‌కు మద్దతు



కరపత్రం ఆవిష్కరిస్తున్న గోపాల్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణలో ప్రజల ఆస్తులతో పాటు ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించేందుకు కాంగ్రెస్ పార్టీకి టీజేఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పన్నాల గోపాల్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్ఎస్‌పి క్యాంపులో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద టీజేఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రచురించిన మతోన్మాద బీజేపీ, నియంత బీఆర్ఎస్‌ను ఓడించాలని ముద్రించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి టీజేఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజేఎఫ్ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, విద్యార్థి జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ధీరావత్ వీరానాయక్, దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ కె. కిరణ్, నాయకులు పగిళ్ల ఆంజనేయులు పళ్ల జానయ్య, మురళి యాదవ్ ఉన్నారు.

గ్రూప్ రాజకీయాలు చేస్తే సహించేదిలేదు



మాట్లాడుతున్న అనుముల శ్రీనివాస్ రెడ్డి

త్రిపురారం : గ్రామాల్లో కార్యకర్తలు గ్రూపు రాజకీయాలు చేస్తే సహించేదిలేదని, పార్టీ అధిష్టానం ఆదేశానుసారం కలిసి కట్టుగా ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని జీఅన్నారం, దుగ్గెపల్లి, కొణతాలపల్లి, కామరెడ్డి గూడెం, కంపాలపల్లి, కంపాసాగర్, బాబుసాయి పేట, పెద్దదేవులపల్లి గ్రామాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రవి కుమార్, అంబటి సోమయ్య, మహిళ అధ్యక్షురాలు పద్మ, అంబటి రాము, అమరేందర్ రెడ్డి, రామచంద్రయ్య, నరోత్తం రెడ్డి, అనుముల వెంకట్ రెడ్డి, అనుముల నర్సిరెడ్డి, పీబీ రవి, పీబీ శ్రీనివాస్. బాలకృష్ణ, రమణారెడ్డి, నరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైనిక్ పాఠశాలకు విద్యార్థి ఎంపిక



కిన్నెర స్టాలిన్

డిండి: మండల పరిధిలోని తవక్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న కిన్నెర స్టాలిన్ ఇటీవల వెలువడిన ఫలితాల్లో స్టేట్ సైనిక్ పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపధ్యాయుడు డి.రాజేనందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మార్చి 10న నిర్వహించిన స్టేట్ సైనిక్ స్కూల్ కామెన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ప్రతిభ కనపరచడంతో మార్చి 22వ తేదిన ఫిజికల్, మెడికల్ టెస్ట్‌ల తోపాటు నిర్వహించిన ఇంటర్వ్యూలో పాసయ్యాడు, దీంతో కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ సైనిక్ స్కూల్లో సీటు రావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు,తోటి విద్యార్థులతోపాటు తల్లీదండ్రులు స్టాలిన్‌ను అభినందించారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



బొట్యానాయక్ తండాలో ప్రచారం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

మిర్యాలగూడ : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ మండలం బోట్యానాయక్‌తండాలో నల్లగొండ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపునకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ రంగారెడ్డి, మిట్టపల్లి సైదులు, జానయ్య, గడగోజు ఏడుకొండలు, పీసీకె.ప్రసాద్, సురేష్, సాగర్‌నాయక్, రాంబాబు, మున్నినాయక్, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

కంచర్ల గెలుపునకు కృషి చేయాలి

నల్లగొండ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ యువనాయకుడు నల్లమోతు సిద్ధార్థ, పార్టీ సీనియర్ నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం పట్టణంలోని టీఎస్ఎఆర్ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగరత్నం, గోవర్ధన్‌రెడ్డి, దొనేటి ఆశాలు, జాజుల రవి, నాగయ్య, శ్రీనయ్య, రవి, రవీందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు

- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా అభివృద్ధి పనులు
- మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం
- విద్యుత్, అదనపు గదుల ఏర్పాట్లు



చామలోనిబావి ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న మరుగుదొడ్ల మరమ్మతులు



పాల్వాయి ఎస్సీ కాలనీ పాఠశాలలో విద్యుత్ పనులు



శాఖాజిపురం ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లకు మరమ్మతులు

గుర్రంపోడు : ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా బడుల్లో మౌలిక వసతులు కల్పన చేపట్టనున్నారు. ఈ కమిటీల ద్వారా మరుగుదొడ్ల, విద్యుత్, అదనపు గదుల నిర్మాణ పనులకు రంగం సిద్ధమైంది. గత ప్రభుత్వం 'మన ఊరు మన బడి' పథకం ద్వారా మొదటి దశలో 25 శాతం పాఠశాలలను ఎంపిక చేయగా పనులు కొన్ని చోట్ల పూర్తికాగా మరికొన్ని చోట్ల వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన పాఠశాలల్లో మౌలిక వసతులను అమ్మ ఆదర్శకమిటీల ద్వారా పనులు చేపట్టనున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్యను అధిగమించేందుకు అదనపు మరుగుదొడ్ల నిర్మాణాకి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. మండలంలో 65 ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి దశలో 'మన ఊరు మన బడి' క్రింద 22 పాఠశాలలను ఎంపిక చేయగా పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కాల్వపల్లి, మునీంఖాన్‌గూడెం పాఠశాల్లో మాత్రం వందశాతం పనులు పూర్తయి ప్రారంభోత్సవం కూడా జరిగాయి. చాలా పాఠశాలల్లో ప్రహరీ లేక వేసవిలో, సెలవు రోజుల్లో మరుగుదొడ్లు ధ్వంసమవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు అన్ని పాఠశాలలకు ప్రహరీ నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన వంట గదులు లేని పాఠశాలలను గుర్తించి మంజూరు చేయనున్నారు.

కమిటీలతోనే అభివృద్ధి పనులు

గతంలో ఉన్న పాఠశాల యాజమాన్య కమిటీల స్థానంలో కొత్తగా ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ కమిటీలతోనే అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వీటిలో అత్యంత ప్రాముఖ్యమైన టాయ్‌లెట్లు, అదనపు గదులు, మైనర్ రిపేర్లు, విద్యుదీకరణ పనులకు మండల స్థాయి నుంచి ప్రతిపాదనలు జిల్లాకు పంపించారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు చైర్‌పర్సన్‌గా, హెచ్‌ఎం కన్వీనర్‌గా కమిటీ ఏర్పాటు చేశారు. పనికి ముందు పరిస్థితులపై ఫొటోల అప్‌లోడ్‌ను వెబ్‌సైట్‌లో చేయాల్సి ఉంది. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో జాతీయ బ్యాంకుల్లో ఖాతాలను ప్రారంభించారు. పనులకు సంబంధించి అమ్మ ఆదర్శకమిటీలు తీర్మానాలకు సమావేశాలు జరుగుతున్నాయి.

త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం



అమ్మ ఆదర్శకమిటీల ద్వారా గుర్తించిన అన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే హెచ్‌ఎంలకు దిశానిర్దేశం చేశాం. మే 31లోగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- తరి రాము, మండల విద్యాధికారి , గుర్రంపోడు